E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :192 ఆదివారం 21 జూన్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో భగీరథ్?కు బెయిల్ మంజూరైంది. నెల రోజులకు పైగా జైల్లో ఉన్న భగీరథ్‌కు తాజాగా మల్కాజిగిరి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

## బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్ జారీ




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** రష్యా రాజధాని మాస్కోలో నల్లటి వర్షం కురవడం సంచలనం రేపింది. మాస్కోలోని కీలక ఆయిల్ రిఫైనరీలతో పాటు ఇతర కీలక ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ఉక్రెయిన్ గురువారం నాడు వందలాది డ్రోన్లతో దాడికి పాల్పడింది. అయితే, ఈ దాడులు జరిగిన కొన్ని గంటల్లోనే మాస్కో పరిసర ప్రాంతాల్లో నల్లటి వర్షం కురవడం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది.

దాడుల అనంతరం భయానక పరిస్థితులు

ఉక్రెయిన్ వైమానిక దాడుల తర్వాత కురుస్తున్న ఈ వర్షం సాధారణ నీటి వర్షం కాదని, ఇదొక రకమైన నల్లటి బూడిదతో కూడిన కలుషిత వర్షమని స్థానికులు చెబుతున్నారు. బ్లాక్ రెయిన్ కారణంగా ప్రజల్లో తీవ్రమైన తలనొప్పి, శ్వాసకోస సమస్యలు తలెత్తుతున్నాయి. నగరంలోని నివాస భవనాలు, రోడ్లపై ఆపి ఉంచిన వాహనాలపై నల్లటి మచ్చల దట్టంగా పేరుకుపోతున్నాయి.కాగా ఇటువంటి రసాయన బూడిద వర్షాలు పర్యావరణానికి, మానవాళికి అత్యంత ప్రమాదకరమని స్థానిక వాతావరణ శాఖ స్పష్టం చేసింది.

## చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు.. ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** ప్రపంచ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఉండవల్లి గుహల వద్ద రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ వేడుకకు యోగా గురుగా పేరొందిన గురు రాందేవ్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఎం చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.

## సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా

### కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడితే కుదరదని, బిడ్డా కాస్కో.. మీకు ముందు ముందు ఇంకా చాలా సినిమా చూపిస్తామని మాజీ ఎమ్మెల్యే, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి మైనంపల్లి హనుమంతరావు హెచ్చరించారు. కేటీఆర్ విపక్షంలోనూ అట్టర్ ఫ్లాప్ అయ్యారని, కేటీర్ ప్రతిదానికి ఎందుకు అంతలా ఉలిక్కిపడుతున్నావ్ అంటూ ప్రశ్నించారు.గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. నిన్న మల్కాజిగిరి నియోజకవర్గం పర్యటన సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు.

## పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** పవన్ కల్యాణ్ ను బూచిగా చూపెట్టి తెలంగాణలో బీజేపీ పాగా వేయాలని చూస్తోందని కానీ తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో మళ్ళీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అధికారంలో శాశ్వతంగా ఉండటం కోసం ఎంత దూరమైన వెళు_న్నారని బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రాంతీయ పార్టీలను చీల్చుతున్నారని ఆరోపించారు. యూనివర్సిటీల్లోకి దూరి బీజేపీ రఘుపతి రాజారాం పేరును మరిచిపోయి గాడ్సే జపం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గాడ్సే రాజ్యం స్థాపించాలని వ్యూహంతో సొంత ఎజెండాను తీసుకొచ్చి జనాలపై రుద్దుతున్నారని దుయ్యబట్టారు.

భ్రష్టు పట్టిస్తున్నారు:

ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారని, 90 శాతం సంపద బీజేపీ నేతల అనునయుల చేతిలో ఉందన్నారు.




# రైతుకు రూ.26 వేల డిమాండ్

## సుఖీభవపై షర్మిల ఫైర్

- అన్నదాతకు పూర్తి సాయం ఇవ్వాలి
- పీఎం కిసాన్‌తో కలపొద్దన్న డిమాండ్
- ప్రతి రైతుకు రూ.20 వేలే ఇవ్వాలి
- కౌలు రైతులకూ వర్తింపజేయాలి
- 30 లక్షల రైతులు ఎందుకు దూరం?
- హామీ అమలుపై షర్మిల ప్రశ్నలు
- అన్నదాత సుఖీభవపై రాజకీయ వేడి
- రైతులకు అన్యాయం జరిగిందన్న విమర్శ
- సుఖీభవ కాదు.. దుఃఖీభవ: షర్మిల
- రాష్ట్రమే పూర్తి భారం భరించాలి
- రైతు ఖాతాల్లో రూ.7 వేల జమ
- 46.85 లక్షల రైతులకు తొలి విడత
- పథకం అమలుపై కొత్త డిమాండ్
- రైతు సంక్షేమంపై మాటల యుద్ధం



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని పీఎం కిసాన్ యోజనతో కలిపి కాకుండా విడిగా అమలుచేయాలని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. కేంద్రంతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని.. అధికారంలోకి వచ్చాక ఈ విషయంలో మడతపేచీ పెట్టారని షర్మిల విమర్శించారు. తామే ప్రతి రైతుకు 20 వేలు ఇస్తామని, కేంద్రం ఇచ్చేది బోనస్ అని చెప్పి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం రైతులకు చేసిన తీరని అన్యాయమని మండిపడ్డారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే., పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 6 వేలను జత చేయకుండా రాష్ట్ర ప్రభుత్వమే ప్రతి రైతుకి 20 వేలు ఇవ్వాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులకు సైతం అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని.. లేని పక్షంలో ఇచ్చిన మాట తప్పినందుకు రైతులకు క్షమాపణలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

మిగతాది 2 లో..

## తెలంగాణలో 'సర్' ప్రక్రియపై బిగ్ అప్‌డేట్

### కొత్త ఓటర్ల నమోదుపై క్లారిటీ




**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** తెలంగాణలో 'సర్' ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త ఓటరు నమోదుకు అవకాశం లేదని వార్తలు వస్తున్నాయని, అవన్నీ అసత్యమని అన్నారు.

## రెండేళ్లు ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వస్తాడు: కేటీఆర్



# తెలంగాణలో 'సర్' ప్రక్రియపై బిగ్ అప్‌డేట్.. కొత్త ఓటర్ల నమోదుపై క్లారిటీ

మొదటి పేజీ తరువాయి




ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా సమగ్రంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ -2026 ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఏజెంట్లకు ఇప్పటికే పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో చేపట్టిన 'సర్'పై వివరాలను వెల్లడించారు.

కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 25 నుంచి బీఎల్వోలు తమ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని వెల్లడించారు. జులై 25వ తేదీలోపు ఎన్యుమరేషన్ సమర్పించాలని, కొత్త ఓటర్లు తమ ఓటు హక్కును అదే ఫారంలో నమోదు చేసుకోవచ్చని క్లారిటీ ఇచ్చారు. చాలా చోట్ల 80 శాతం మ్యాపింగ్ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పత్రాలను కూడా అనుమతిస్తామని, 2002లో అనుసంధానమైన వారికి ఇతర పత్రాలు అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా ప్రచురించే వరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తుందని హామీ ఇచ్చారు. ఇప్పటికే డేటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించుకుంటున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు తీసుకొచ్చే ఫామ్‌లను ముసాయిదాలో పొందుపరుస్తున్నామని వెల్లడించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పామన్నారు.

# రెండేళ్లు ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వస్తాడు: కేటీఆర్



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో పర్యటించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు. రైతు కుటుంబానికి ధైర్యం చెప్పండని కేసీఆర్ తమను ఇక్కడికి పంపించారని అన్నారు. రెండేళ్లు దయచేసి ధైర్యంగా బ్రతకండి, మళ్లీ కేసీఆర్ వచ్చి మిమ్మల్ని కళ్ళలో పెట్టుకుని చూసుకుంటామని చెప్పమ్మన్నాడని తెలిపారు. పంట కొనలేదని రైతు విషం తాగి పడిపోతే ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని మండిపడ్డారు.

రాష్ట్రంలో ఉన్న ప్రతి రైతు పరిస్థితి ఇదేనని అన్నారు. పాండురంగ్ కుటుంబానికి కనీసం రుణమాఫీ కాలేదు, రైతుబంధు కూడా పడటం లేదని చెప్పారు. చనిపోయిన ప్రతీ రైతుకి కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కుటుంబంలో చదువుకున్న పిల్లలు ఉంటే వాళ్ళకి తప్పకుండా ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. ధాన్యం కొనక, లంచం సిస్టం పెట్టి, కనీసం మార్కెట్ యార్డులో నీళ్లు కూడా లేవని విమర్శించారు. కాబట్టి ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. నిజంగానే ధాన్యం కొనడంలో ప్రభుత్వం రికార్డ్ సృష్టించి ఉంటే పాండురంగ్ అనే రైతు ఎందుకు చనిపోయాడని ప్రశ్నించారు. కరోనా సమయంలో కూడా తాము 8500 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసామని, ప్రభుత్వం చెప్పే మాటలు నమ్మవద్దని అన్నారు. కావాలంటే కొనుగోలు కేంద్రాల దగ్గరికి వెళ్లి అడగాలని సూచించారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌కు బెయిల్

మొదటి పేజీ తరువాయి



అరణ్య ఫాంహౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్: కాగా, ఓ మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న ఆరోపణలతో బండి బగీరథ్‌పై గత మే 8వ తేదీన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైంది. నాటకీయ పరిణామాల మధ్య ఈ కేసు విచారణాధికారి కూకట్ పల్లి డీసీపీ రితిరాజ్ ఆదేశాలతో 5 బృందాలుగా రంగంలోకి దిగిన పోలీసులు మే 16న భగీరథ్ ను అరెస్ట్ చేసి చర్లపల్లి జైలుకు రిమాండ్ ఖైదీగా తరలించారు. ఈ కేసు దర్యాప్తులో మరిన్ని కీలక ఆధారాలు సేకరించేందుకు పోలీసులు తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును ఆశ్రయించగా మల్కాజిగిరి కోర్టు 3 రోజుల కస్టడీకి అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆయన్ను కస్టడీకి తీసుకున్న పేట్ బషీరాబాద్ పోలీసులు చర్లపల్లి జైలు నుంచి తమ అదుపులోకి తీసుకుని మొయినాబాద్ లోని అరణ్య ఫామ్ హౌస్‌కు భగీరథ్‌ను తీసుకువెళ్లారు. అక్కడ సీన్ రీ కన్ స్ట్రక్చన్ నిర్వహించారు. ఈక్రమంలో భగీరథ్ దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన మల్కాజిగిరి కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడు.. ప్రశంసల వర్షం కురిపించిన బాబా రాందేవ్

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా.. బాబా రాందేవ్.. సీఎం కు వివిధ రకాల యోగా ప్రక్రియలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులో కూడా ఎంతో ఆరోగ్యంగా ఉన్నారని కొనియాడారు. అభివృద్ధి, విజన్ కలిగిన సీఎం అంటూ.. కితాబిచ్చారు. ప్రధాని నరేంద్రమోడీ వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా.. సీఎం పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ కోసం ప్రధాని మోదీ కృషి చేస్తోంటే.. భారత్ ను విశ్వగురుగా నిలపాలన్న ప్రధాని కృషికి చంద్రబాబు తోడయ్యారన్నారు. చంద్రబాబు తరహాలో ప్రతి సీఎం పనిచేస్తే వికసిత్ భారత్ 2047 లక్ష్యం ముందుగానే సాకారమవుతుందని బాబా రాందేవ్ ఆశించారు. దేవతల రాజధాని అమరావతి.. ఇప్పుడు యోగా రాజధాని అయిందన్నారు. చంద్రబాబు ప్రకృతి, సాంస్కృతిక, యోగా ప్రేమికుడు మాత్రమే కాదని, ఆయన సర్వజన ప్రేమికుడని ప్రశంసించారు.

సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. యోగా సాధనతో రాందేవ్ బాబా అద్భుతాలు సృష్టిస్తున్నారని కొనియాడారు. రాందేవ్ బాబా శిక్షణలో యువత చేస్తున్న యోగాసనాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయని, యోగాకు మంచి గుర్తింపు తీసుకొచ్చింది రాందేవ్ బాబానే అన్నారు. ప్రస్తుత సమాజంలో యువత చాలా ఒత్తిడితో ఉందని, ఆధ్యాత్మికతతో కూడిన సాంకేతికత చాలా అవసరమని సీఎం పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా 190 దేశాలు యోగాను అనుసరిస్తున్నాయన్నారు. త్వరలో దేశానికి ఆధ్యాత్మిక హబ్ గా ఏపీ మారనుందని తెలిపారు. పర్యవరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, రాష్ట్రంలో 50 శాతం పచ్చదనాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

# సవాలే లేదు బట్టలిప్పి పరుగెత్తిస్తా.. కేటీఆర్ పై మైనంపల్లి సెన్సేషనల్ కామెంట్స్

మొదటి పేజీ తరువాయి



ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పనులను అడ్డుకోవమే కేటీఆర్, హరీశ్ రావు పనిగా పెట్టుకున్నారని ధాన్యం సేకరణ విషయంలో ఈ ఇద్దరూ లారీలను అడ్డుకున్నారని ఆరోపించారు. అమెరికా నుంచి నేరుగా వచ్చి పదవులు అనుభవిస్తున్న కేటీఆర్ సిరిసిల్ల ఉద్యమాకారుడి నోట్లో మట్టికొట్టాడని విమర్శించారు.

సెలబ్రిటీల జీవితాలను నాశం చేశావ్:

కేటీఆర్ దండుపాళ్యం బ్యాచ్ అని మాట్లాడుతున్నాడు.. దండుపాళ్యం బ్యాచ్, స్టూవర్టుపురం దొగలకైనా మినిమం ఎథిక్స్ ఉంటాయి. మీకులా వారు సొంత చెల్లి, బావ, రాజకీయ నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించరని, కేటీఆర్ సెలబ్రెటీల ఫోన్లు ట్యాప్ చేసి వారి జీవితాలను నాశనం చేశాడని ఆరోపించారు. మేం రౌడీయిజం చేసేటోళ్లం కాదని రౌడీలకు బుద్ధి చెబుతూ హీరోయిజం చేసేటోళ్లం అన్నారు. సవాలే లేదని బట్టలిప్పి పరుగెత్తిస్తామన్నారు. మైనంపల్లి మాటల మనిషి కాదని చేతల మనిషి అని చెప్పారు. మల్కాజిగిరికి వస్తానంటున్నావ్ నేను సిరిసిల్లాకు రాలేనా అని ప్రశ్నించారు.

అర్ధరాత్రి పోలీసులకు దొరికిన చరిత్ర నీది:

మంత్రి హోదాలో గన్ మెన్లు ఎవరూ లేకుండా అర్ధరాత్రి ఒంటరిగా వెళ్తుండగా అప్పా జెంక్షన్?లో ముఖానికి మాస్క్ పెట్టుకుని దొరికిన ఘనత కేటీఆర్ ది అని సంచలన ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పోలీసు డిపార్ట్ మెంట్ చర్చించుకుందన్నారు. మేము దొంగతనం చేయడం లేదని హీరోయిజం చేస్తున్నామని, ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ప్రభుత్వంలో ఉన్నామనే ఓపికతో వెళ్తున్నామని అదే మేము తలుచుకుంటే ఒక్క రోజు కూడా నిద్రపోలేవని ఫైర్ అయ్యారు. ఇంగ్లీశ్ మాట్లాడటంలో కేటీఆర్ తనకు తానే తోపు అనుకుంటున్నాడని కానీ మెజారిటీ మంత్రుల్లో ఆయనకంటే మంచి ఇంగ్లీశ్ మాట్లాడేవారు ఉన్నారన్నారు.

# పవన్ కల్యాణ్ ముసుగులో తెలంగాణలో బీజేపీ ప్లాన్: మహేశ్ కుమార్ గౌడ్

మొదటి పేజీ తరువాయి



ఆర్ఎస్ఎస్ భావాలు గల వ్యక్తులు యూనివర్సిటీల్లో దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని హాట్ కామెంట్స్ చేశారు. బార్డర్‌లో చైనా భారత భూభాగంలోకి చొచ్చుకొస్తా ఉంటే బీజేపీ ఆ విషయం మాట్లాడటం లేదన్నారు. రాహుల్ గాంధీ లోక్ సభలో ఈ విషయాన్ని ఫోటోలతో సహా చూపించారన్నారు. గాంధీ కుటుంబం త్యాగ మూర్తుల కుటుంబం అని నెహ్రూ,గాంధీ గురించి అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని గుర్తు చేశారు.

ఆయన్ను ఉరి తీసినా తప్పులేదు:

మీనాక్షి నటరాజన్ నామినేషన్ విషయంలో దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని అసలు కేసు లేకుండా నామినేషన్ రిజెక్ట్ చేసిన రిటర్నింగ్ ఆఫీసర్ ను ఉరి తీసినా తప్పులేదన్నారు. జార్ఖండ్?లో అంబానీ తరపు వ్యక్తికి సరైన పత్రాలు లేకున్నా మరోసారి అవకాశం ఇచ్చారని ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా బీజేపీ నేతలు గెలిచే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారన్నారు. లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# సింగరేణి సమస్యలపై కవిత సంచలన వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 20 జూన్ (తెలుగు గళం):** సింగరేణి సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. నేడు కవిత భూపాలపల్లి జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి అధికారుల పీఆర్పీ చెల్లింపునకు డిప్యూటీ సీఎం లంచం అడుగుతున్నారని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో అంతలా అవినీతి పెరిగిపోయిందని అన్నారు. నిషేధిత డిటోనేటర్ల కొనుగోలు, కారుణ్య నియామకాలు, మెడికల్ బోర్డు లాంటి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వానికి జూలై 20 వరకు డెడ్ లైన్ విధించారు. ఏ మైన్‌కు వెళ్లినా రెండు ప్రధాన సమస్యలు కనిపిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం సింగరేణికి ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకపోవడం వల్ల సంస్థ నష్టాల్లో కూరుకుపోయి కార్మికులకు ఇవ్వాల్సిన పనిముట్లు ఇవ్వడంలేదన్నారు. దానివల్ల కార్మికుల భద్రతకు ముప్పు కలుగుతోందని వ్యాఖ్యానించారు. కార్మికులకు హక్కుగా ఉన్న కారుణ్య నియామకాలను ఇవ్వడంలేదని విమర్శించారు. కార్మికుల హక్కుల గురించి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సింగరేణిలో కనీసం మంచినీరు, ఆక్సీజన్ ఇవ్వలేదని పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు.

# బ్లాక్ రెయిన్.. డేంజర్ అలర్ట్స్ జారీ

మొదటి పేజీ తరువాయి



హెచ్చరికలు జారీ

పరిస్థితి తీవ్రతను గమనించిన మాస్కో నగర అధికారులు ప్రజలకు పలు కీలక సూచనలు జారీ చేశారు. నల్లటి వర్షం కురుస్తున్నందున ప్రజలెవరూ ఇళ్ల నుంచి బయటకు రాకూడదని, తలుపులు, కిటికీలు పూర్తిగా మూసి ఉంచాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, ఆస్తమా వంటి ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్నవారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమెర్జెన్సీ అలర్ట్స్ జారీ చేశారు.

4 ఎయిర్పోర్టులు మూసివేత.. 500 పైగా విమానాలు రద్దు

రష్యాపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి కావడంతో మాస్కోలో తీవ్ర ఆందోళన నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా మాస్కో నగర పరిధిలోని విమానాశ్రయాలన్నింటినీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. ఎయిర్‌పోర్టుల మూసివేత కారణంగా అంతర్జాతీయ, దేశీయ రూట్లకు సంబంధించిన దాదాపు 500కు పైగా విమాన సర్వీసులు పూర్తిగా రద్దయినట్లు రష్యా అధికారులు అధికారికంగా ప్రకటించారు.

# రైతుకు రూ.26 వేల డిమాండ్ సుఖీభవపై షర్మిల ఫైర్

మొదటి పేజీ తరువాయి



"అన్నదాత సుఖీభవ కాదు దుఃఖిభవ. మూడో ఏడాది సైతం రైతులకు మోసమే. పెట్టుబడి సాయాన్ని చంద్రబాబు మొక్కుబడి చేశారు. రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నామని అరకొర విధింపులతో మమ అనిపిస్తున్నారు. రాష్ట్రంలో 80 లక్షల మంది అర్హత కలిగిన రైతన్నలు ఉంటే, ఈ ఏడాది సైతం ఇస్తున్నది కేవలం 46.86 లక్షల మందికే. ముచ్చటగా 30 లక్షల మంది రైతులకు మళ్లీ ఎగనామమే. తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో సంవత్సరం రైతులకు కత్తెరేశారు. మూడో యేడు పథకాన్ని నామమాత్రం చేశారు. సుఖీభవను సగం సగం చేశారు." అని షర్మిల విమర్శించారు.

కూటమి ప్రభుత్వం పంట నష్ట పరిహారాన్ని ఎగ్గొట్టిందని.. మద్దతు ధరలకు మంగళం పాడిందని షర్మిల మండిపడ్డారు. పంట భీమాకి ధీమా లేకుండా చేశారని.. ఎరువులు ఇవ్వకుండా రైతులను అరిగోస పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్డులు ఇస్తామని చెప్పి 30 లక్షల మంది కౌలు రైతులను కకావికలం చేశారన్న షర్మిల.. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ చేసిందని మండిపడ్డారు.

మరోవైపు అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం కింద 2026-27 సంవత్సరానికి సంబంధించిన తొలివిడత సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతుల ఖాతాల్లో రూ.3,125.47 కోట్లు జమ చేయనుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.2,342.92 కోట్లు కాగా... కేంద్ర ప్రభుత్వం వాటా రూ.782.55 కోట్లు. అర్హులైన రైతులు ఒక్కొక్కరికీ రూ.7 వేలు చొప్పున జమ చేయనున్నారు.

# బోనస్ లేదు.. కొనుగోళ్లు లేవు..

## రైతులను నట్టేట ముంచిన రేవంత్ సర్కార్ ఆరూరి రమేష్ ఫైర్

## రైతు భరోసా ఖతం.. రైతు బీమా ఖతం.. రేవంత్ పాలనలో రైతుకు మిగిలింది శూన్యం: ఆరూరి




**తెలుగు గళం న్యూస్, హన్మకొండ, జూన్ 20:** హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం వర్ధన్నపేట నియోజకవర్గ బీఎల్ఏలు,సభ్యత్వ నమోదు, సోషల్ మీడియా విభాగాలకు చెందిన2,000 మంది ప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యే సందర్భంగా వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు, బూత్ కమిటీ బీఎల్ఏలతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హన్మకొండ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్, మాజీ రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ...వరంగల్‌లో రాహుల్ గాంధీ ప్రకటించిన డిక్లరేషన్‌లో అన్ని పంటలకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బోనస్ లేదని,అన్ని పంటలను రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయదని తేల్చి చెప్పింది.ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలు"ఎంత వడ్లు పండించినా మేమే కొంటాం"అని రైతులను నమ్మబలికారు. ఇప్పుడు మాత్రం "కేంద్రం ఏది కొనమంటే అంతే కొంటాం" అని చేతులెత్తేస్తున్నారు. చివరి గింజ వరకూ కొంటామని, రూ. 500 బోనస్ ఇస్తామని నమ్మించి ఇప్పుడు మోసం చేయడం సిగ్గుచేటు. ఈ నిర్ణయానికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్రం కొన్నా కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే అన్ని పంటలు కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర కల్పించారు.కానీ ఇప్పుడు కేంద్రం జొన్నలు, మక్కలు కొనదు అనే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటిని కొనమని చెబుతోంది. ఈ ఏడాది కేంద్రం 50 లక్షల మెట్రిక్ టన్నుల వరి కొంటే, వచ్చే ఏడాది నువ్వు అంతే కొని వదిలేస్తావా? రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను తడిగుడ్డతో గొంతు కోసి దారుణంగా మోసం చేసిందని ఆయన మండిపడ్డారు.బోనస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది.ఎన్నికల ముందు అన్ని పంటలకు బోనస్ అన్నారు, తర్వాత వరికి మాత్రమే అన్నారు, ఆ తర్వాత సన్నాలకు మాత్రమే అన్నారు. ఆ సన్నాల్లో కూడా 33 రకాలకే బోనస్ అని ఇప్పుడు కేవలం 7 రకాలకు మాత్రమే అంటున్నారు. ఆ 7 రకాల్లో బీపీటీ-5204 లాంటి రకాలకు విపరీతమైన చీడపీడలు ఉంటాయి. దిగుబడి ఎకరానికి 20 క్వింటాళ్లే వస్తుంది. అదే ఇతర రకాల్లో 30 క్వింటాళ్లు వస్తుంది. రూ. 500 బోనస్ కోసం తక్కువ దిగుబడి వచ్చే పంట వేస్తే రైతే నష్టపోతాడు. బోనస్ ఇచ్చే రకాలను 33 నుంచి 7కు ఎందుకు కుదించారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.పోయిన యాసంగికి రూ. 1200 కోట్ల బోనస్, ఈ వానాకాలం రూ. 700 కోట్ల బోనస్ ఎగ్గొట్టారు.రైతుబంధు, రైతుబీమాపై విమర్శలు:కేసీఆర్ ఏనాడూ రైతుబంధు వేయడానికి మీటింగ్ పెట్టలేదు. 11 విడతల్లో రూ. 74 వేల కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో వేశారు. కానీ రేవంత్ రెడ్డి ఎకరానికో మీటింగ్ పెడుతున్నాడు. రైతుబంధు రూ. 10,000 నుంచి రూ. 15,000 చేస్తామని చెప్పి, 2024-25 వానాకాలం ఒక్క ఎకరాకు కూడా ఇవ్వలేదు. 2024-25 యాసంగికి మూడెకరాలకు ఇచ్చి మిగతా వారికి ఎగ్గొట్టారు. 2025-26 యాసంగికి రెండెకరాలకు ఇచ్చి మిగతా రైతులకు ఎగ్గొట్టారు.కేసీఆర్ ప్రభుత్వంలో చనిపోయిన 10 రోజుల్లో ఖాతాలో పడే రైతు బీమా, ఇప్పుడు ఐదు నెలలైనా ఎందుకు రావడం లేదు?

యూరియా కొరతపై ఆగ్రహం యూరియా విషయంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు రెండూ రైతుల జీవితాలతోచెలగాటమాడుతున్నాయి. వరంగల్ జిల్లా హసన్‌పర్తి, పర్వతగిరి, ఐనవోలు, ఖాజీపేట, వర్ధన్నపేట మండలాల్లో మిర్చి పంటకు ఎకరాకు 5-6 బస్తాల యూరియా అవసరం. కానీ రెండు బస్తాలు మాత్రమే ఇస్తే మిగతావి ఎక్కడికి పోవాలి అని ప్రభుత్వాన్ని నిలదీశారు.కేంద్రం డీజిల్,ఎరువుల ధరలు పెంచి రైతుపై భారం మోపుతోంది, కానీ దానికి తగ్గట్టు మద్దతు ధర పెంచడం లేదు.డిమాండ్:

కొనుగోళ్లు ఖతం,రైతుబంధు ఖతం, రైతుబీమా ఖతం,యూరియా ఖతం.. రైతులకు ఏమీ మిగిల్చేటట్టు లేదు ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వం. కేబినెట్‌లో తీసుకున్న ఈ కర్కశ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకుని, రైతులకు క్షమాపణ చెప్పి,అన్ని పంటలను యథావిధిగా కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ హెచ్చరించారు.ఈ సమావేశంలో మాజీ రైతు రుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, హన్మకొండ జిల్లా మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షురాలు లలిత యాదవ్, కార్పొరేటర్ రాధికా రెడ్డి,పర్వతగిరి మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు,మాజీ ఏఎంసీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, వర్ధన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు తుళ్ల కుమారస్వామి,పట్టణ అధ్యక్షులు గోధుమల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల కంటే ఉద్యోగ అవకాశాలే శాశ్వత పరిష్కారం:- నిరుద్యోగి రాజేష్ డిమాండ్

**తెలుగు గళం న్యూస్ వరంగల్, జూన్ 20**



అడ్డ రాజేష్
మాస్టర్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్
అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుడు
కాకతీయ యూనివర్సిటీ వరంగల్

తెలంగాణలో నిరుద్యోగ సమస్యను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని అంబేద్కర్ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుడు అడ్డ రాజేష్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిన రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సామాజిక, ఆర్థిక సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు.రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో వేల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం వల్ల నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉద్యోగాల భర్తీ జరగకపోతే నిరుద్యోగ భృతి, ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ




వయస్సును పునఃసమీక్షించి యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిరుద్యోగ సమస్య కారణంగా ఉన్నత విద్యావంతులైన యువత విదేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, గవర్నర్, సంబంధిత ఉన్నతాధికారులు నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉద్యోగాల కల్పన ద్వారానే రాష్ట్రం, దేశం సమగ్ర అభివృద్ధి సాధించగలదని అన్నారు.

## ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి

**తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 20**




ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి పేద, మధ్యతరగతి సహా అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్య అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు.శనివారం జనగామ పట్టణంలోని ధర్మకంచ హైస్కూల్‌ను సీపీఎం బృందం సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకుంది.అనంతరం మోకు కనకారెడ్డి మాట్లాడుతూ, తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యం ఇస్తున్నాయని విమర్శించారు. దీనివల్ల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని అన్నారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ధర్మకంచ హైస్కూల్‌లో నిర్వహించిన సర్వేలో హిందీ, ఇంగ్లీష్, తెలుగు, పీఈటీ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరో ఐదు తరగతి గదులు అవసరమని, వాటి నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే పాఠశాల ప్రహరీ గోడలో కొంత భాగం కూలిపోవడంతో భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయని, దానిని అత్యవసరంగా మరమ్మతు చేయాలని కోరారు.మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కేవలం రూ.2,000 మాత్రమే వేతనం అందుతుండటంతో రోజుకు సుమారు రూ.65 మాత్రమే వస్తోందని, దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి వేతనాలను పెంచి, సంక్షేమ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించి వారిని ఆదుకోవాలని, ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం విద్యా రంగానికి బడ్జెట్‌లో మరిన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాలను కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, ఎండీ అజారుద్దీన్, పొత్కనూరి ఉపేందర్, బోట్ల శ్రావణ్, దేవదానం, బాల్నె వెంకట మల్లయ్య, పుత్కనూరి కనకాచారి తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్, ప్రైవేట్ బస్సుల ఫిట్‌నెస్‌పై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి

### ఎఐఆర్టీడబ్ల్యుఎఫ్ -సిఐటియు జిల్లా అధ్యక్షుడు బూడిద ప్రశాంత్, కార్యదర్శి సుంచు విజేందర్ డిమాండ్

**తెలుగు గళం న్యూస్ జనగామ జూన్ 20**



జిల్లాలో నడుస్తున్న స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులపై సమగ్ర తనిఖీలు నిర్వహించి భద్రతా ప్రమాణాలు పాటిస్తున్న వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జనగామ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏఓ బెంజిమెన్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు బూడిద ప్రశాంత్, ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, సాధారణ ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని స్కూల్, ప్రైవేట్ బస్సులపై ప్రత్యేక తనిఖీ డ్రైవ్ చేపట్టాలని కోరారు.బస్సుల బ్రేకులు, టైర్లు, అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, బీమా పత్రాలు, అనుమతులు తదితర భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన వాహనాలకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలోని అనేక ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలలకు చెందిన బస్సులు సరైన కండిషన్‌లో లేకపోవడం వల్ల గతంలో పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, రవాణా శాఖ పర్యవేక్షణ లోపాలే ఇందుకు కారణమని విమర్శించారు.అందువల్ల స్కూల్, కాలేజీ బస్సుల తనిఖీలను ముమ్మరం చేసి భద్రతా ప్రమాణాలు పూర్తిచేసిన వాహనాలకు మాత్రమే అనుమతులు ఇవ్వాలని కోరారు.అలాగే ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పూర్తి అర్హతలు, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగిన డ్రైవర్లను మాత్రమే నియమించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎఐఆర్టీడబ్ల్యుఎఫ్–సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చీర శ్రీనివాస్, దయాసాగర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ధర్నా

### గేటుకు వినతిపత్రం కట్టి వినూత్న నిరసన

**తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 20**



అధికారులు అందుబాటులో లేకపోవడంతో తెలంగాణ రైతు సంఘం నాయకులు జనగామ తహసీల్దార్ కార్యాలయం గేటుకు వినతిపత్రాన్ని కట్టి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రైతు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జూన్ 19 నుంచి 22 వరకు నిర్వహిస్తున్న రైతాంగ ధర్నాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా చందు నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ధాన్యం బోనస్ వంటి కీలక హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. “రైతును రాజు చేస్తామని చెప్పిన ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది” అని ఆరోపించారు.రైతు భరోసా పథకంలో పెండింగ్‌లో ఉన్న గత యాసంగి, ప్రస్తుత వానకాలం నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సన్న ధాన్యం బోనస్ బకాయిలను విడుదల చేయాలని కోరారు.వ్యవసాయ రంగంలో విద్యుత్ ప్రైవేటీకరణకు దారితీసే రైతు డిస్కంను వెంటనే వెనక్కి తీసుకోవాలని, పొటాష్, భాస్వరం, కాంప్లెక్స్ ఎరువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.యూరియా బుకింగ్ యాప్‌ను రద్దు చేసి రైతులకు సులభంగా ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, బ్యాంకులు తమ డిపాజిట్లలో కనీసం 18 శాతం వ్యవసాయ రంగానికి పంట రుణాలుగా ఇవ్వాలని కోరారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పూర్తి స్థాయిలో పంట రుణాలు మంజూరు చేయాలని, కిసాన్ సమ్మాన్ పథకాన్ని అర్హులైన రైతులందరికీ వర్తింపజేయాలని అన్నారు.అదేవిధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు నేరుగా పొలాలకు వెళ్లి క్రాప్ బుకింగ్ నిర్వహించాలని, నకిలీ విత్తనాల నివారణకు కఠిన చట్టం తీసుకురావాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు పంటలకు కనీస మద్దతు ధర అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, జిల్లా సీనియర్ నాయకులు మద్దోజు రామచోక్యం, కాసా జగన్, పట్టణ కమిటీ సభ్యులు బాల్దే అంజయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఖాళీ స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలి

### మున్సిపల్ కమిషనర్‌కు 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి వినతి



**తెలుగు గళం న్యూస్ జనగామ, జూన్ 20**

జనగామ పట్టణంలోని 3వ వార్డులో గృహ నివాసాల మధ్య ఉన్న ఖాళీ ఇంటి స్థలాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌కు 3వ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో అనేక ఖాళీ ప్లాట్ల యజమానులు ఇతర ప్రాంతాల్లో నివసిస్తుండటంతో ఆయా స్థలాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని తెలిపారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెట్లు అధికంగా పెరగడంతో పాటు కొందరు చెత్తను వేయడం వల్ల దుర్గంధం వెదజల్లుతోందని పేర్కొన్నారు.దీంతో పాములు, విషపురుగులు నివాస గృహాల్లోకి వచ్చే ప్రమాదం ఏర్పడిందని, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.కావున మున్సిపల్ అధికారులు ఆయా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి నోటీసులు జారీ చేయాలని, వారు స్పందించని పక్షంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుభ్రత పనులు చేపట్టి సంబంధిత యజమానులపై జరిమానాలు విధించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రారంభోత్సవానికే పరిమితమా? ప్రజలకు వైద్యం వద్దా?

### తమ్మడపల్లి జి గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానా-ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం

### తలుపులు కూడా తెరవని అధికారులు






**తెలుగు గళం న్యూస్-- జఫర్‌గడ్, జూన్ 20**

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తమ్మడపల్లి జి గ్రామంలో రూ.20 లక్షల ప్రజాధనంతో నిర్మించిన పల్లె దవాఖానా--ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం పరిస్థితి ప్రస్తుతం ప్రజలను ఆగ్రహానికి గురిచేస్తోంది. ఈ నెల 16న ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘనంగా ప్రారంభించిన ఈ దవాఖానా, ప్రారంభోత్సవం ముగిసిన నాలుగు రోజులైనా ఇప్పటికీ తలుపులు తెరవకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన ఆసుపత్రి భవనం కేవలం ప్రారంభోత్సవాల కోసం మాత్రమే నిర్మించారా?ప్రజాధనంతో నిర్మించిన భవనాన్ని రిబ్బన్ కటింగ్ కార్యక్రమానికే పరిమితం చేశారా?అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.గ్రామ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన దవాఖానాలో ఇప్పటివరకు వైద్య సిబ్బంది లేరు,మందులు లేవు,పరికరాలు లేవు.అంతేకాదు,భవనం తలుపులు కూడా తెరవకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.”ప్రారంభోత్సవం చేసి ఫోటోలు దిగడం కోసం ప్రజాధనం ఖర్చు చేశారా? లేక ప్రజలకు వైద్యం అందించడానికా?” అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.ఎన్నికల హామీలు, ప్రచార ఆర్భాటాల కోసం మాత్రమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి,తరువాత ప్రజలను గాలికొదిలేయడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లక్షల రూపాయలతో నిర్మించిన దవాఖానా ప్రజలకు ఉపయోగపడకపోతే అది ప్రజాధన దుర్వినియోగమేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వెంటనే దవాఖానాను పూర్తిస్థాయిలో ప్రారంభించి వైద్య సిబ్బందిని



నియమించాలని, అవసరమైన మందులు, పరికరాలు అందుబాటులో ఉంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు.ప్రారంభోత్సవాలు కాదు–ప్రజలకు వైద్యం కావాలి అంటూ తమ్మడపల్లి జి గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను నిలదీస్తున్నారు.

## రైతు డిక్లరేషన్‌ను కాంగ్రెస్ తుంగలో తొక్కింది-మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, జూన్ 20**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతు డిక్లరేషన్‌ను పూర్తిగా తుంగలో తొక్కిందని తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య ఆరోపించారు.స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాహుల్ గాంధీ చేత రైతు డిక్లరేషన్ ప్రకటింపజేసి రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.అయితే ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కేంద్రం సూచించిన మేరకే పంట కొనుగోళ్లు జరుగుతాయని చెప్పడం రైతులను నిరాశకు గురిచేస్తోందని విమర్శించారు.అధికారంలోకి వచ్చిన వెంటనే 40 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 25 లక్షల మందికే పరిమితమైందని ఆరోపించారు. రూ.20 వేల కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించినప్పటికీ రైతుల ఖాతాల్లో సుమారు రూ.12 వేల కోట్లే జమయ్యాయని పేర్కొన్నారు.రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల చొప్పున, కౌలు రైతులకు అదే స్థాయిలో, భూమిలేని రైతులకు రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. ఐదు విడతలుగా రైతు భరోసా అందాల్సి ఉండగా కేవలం రెండు విడతలకే పరిమితమైందన్నారు.ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని, రాష్ట్రంలో ఉత్పత్తి అయిన ధాన్యంలో కేవలం 60 శాతం మాత్రమే కొనుగోలు చేయగా మిగిలిన 40 శాతం మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో తెలంగాణ వరి ఉత్పత్తిలో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలను మించిందని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేదని తెలిపారు.ప్రస్తుతం యూరియా ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రైతు సమస్యలపై నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.ఈ నెల 29న జనగామలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించే బీఎల్ఏ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరుకానున్నారని తెలిపారు. పార్టీ నియమించిన బీఎల్ఏలు, మండల అధ్యక్షులు, ఇన్‌చార్జులు, కోఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ఇన్‌చార్జులు, ముఖ్య నాయకులు ఆకుల కుమార్, పల్లెపాటి జైపాల్ రెడ్డి, రమేష్ నాయక్, చందర్ రెడ్డి, ఆరేపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేను డబ్బులు తీసుకోలేదు.. నాపై కావాలనే కుట్ర జరుగుతోంది

### భూ వివాదంలో తన పేరును లాగడంపై సర్పంచ్ తోట నాగరాజు ఆగ్రహం

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ జూన్ 20**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్ద పెండ్యాల గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 59కు సంబంధించిన సివిల్ భూ వివాదంలో తన పేరును అనవసరంగా లాగుతూ కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని గ్రామ సర్పంచ్ తోట నాగరాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, గ్రామ సర్పంచ్‌గా బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ ప్రజలకు న్యాయం చేయడమే తన లక్ష్యమని, అలాంటి తనపై నిరాధార ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు. భూమికి సంబంధించిన అసలు వివాదం ఇతర వ్యక్తుల మధ్య కొనసాగుతున్నప్పటికీ, గ్రామ పెద్దగా ఇరువర్గాల మధ్య సామరస్యపూర్వక పరిష్కారం కోసం మాత్రమే తాను ప్రయత్నించానని తెలిపారు.ఈ సందర్భంగా బొంపెల్లి సుధీర్ రావు అనే వ్యక్తి తన వద్దకు వచ్చి భూ వివాదానికి సంబంధించిన విషయాలను చర్చించడం వాస్తవమేనని, అయితే ఆ వ్యవహారంలో తాను ఎలాంటి డబ్బులు తీసుకోలేదని నాగరాజు స్పష్టం చేశారు. తనకు రూ.2 లక్షలు ఇచ్చినట్లు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని పేర్కొన్నారు.తనకు డబ్బులు ఇచ్చినట్లు ఆరోపిస్తున్న వారు ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తన ప్రతిష్టను దెబ్బతీయడానికి,



రాజకీయంగా ఇబ్బంది పెట్టడానికి కొందరు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.తనపై చేస్తున్న ఆరోపణలకు ఎలాంటి వాస్తవాలు లేవని, నిజానిజాలు ప్రజల ముందుకు రావాలని కోరారు. ప్రజలు తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని విజ్ఞప్తి చేసిన ఆయన, అవసరమైతే తన పరువుకు భంగం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై బీఎల్ఓలకు శిక్షణ



**తెలుగు గళం న్యూస్, జఫర్‌గడ్, జూన్ 20**

ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా జఫర్‌గడ్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం బూత్ లెవల్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో ఎస్. కిరణ్ ప్రకాష్ హాజరై బీఎల్ఓలకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఓటరు జాబితా పరిశీలన, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ, మరణించిన మరియు ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్. కిరణ్ ప్రకాష్ మాట్లాడుతూ, ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా బీఎల్ఓలు కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల శాఖ అధికారులు, బీఎల్ఓలు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# తన భూమిని అక్రమంగా పట్టా చేసుకొని వేధింపులకు గురిచేస్తున్నాడు -- రైతు మణుగూరు కనకయ్య




**తెలుగు గళం న్యూస్ హన్మకొండ/ధర్మసాగర్ జూన్ 20**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 59లో ఉన్న తన పూర్వీకుల భూమిని అక్రమంగా పట్టా చేసుకొని తనను వేధింపులకు గురిచేస్తున్నారని రైతు మణుగూరు కనకయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడిన ఆయన, గత వందేళ్లకు పైగా తమ కుటుంబ వారసత్వంగా వస్తున్న 6 ఎకరాల భూమి తమ ఆధీనంలోనే ఉందని తెలిపారు. ఈ భూమిలో 4 ఎకరాలకు తన పేరుపై పట్టా ఉన్నప్పటికీ, మిగిలిన 2 ఎకరాలకు పట్టా ప్రక్రియ పూర్తి కాలేదని చెప్పారు. అయితే తాను మొత్తం 6 ఎకరాల భూమిని నిరంతరం సాగు చేస్తూ కుటుంబ జీవనోపాధి కొనసాగిస్తున్నానని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో బొంపెల్లి సుధీర్‌రావు అనే వ్యక్తి రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై తనకు తెలియకుండా రికార్డుల్లో మార్పులు చేయించి, 2 ఎకరాల భూమిని అక్రమంగా తన పేరుపై పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. ఈ విషయాన్ని తాను ప్రశ్నించడంతో తనపై ఒత్తిళ్లు, బెదిరింపులు పెరిగాయని కనకయ్య తెలిపారు. భూమిని వదులుకోవాలని పలుమార్లు హెచ్చరికలు చేసినట్లు, గూండాలను పంపించి భయభ్రాంతులకు గురిచేసినట్లు ఆరోపించారు. అంతేకాకుండా తన వ్యవసాయ భూమిలో ఉన్న బావికి ఏర్పాటు చేసిన మోటార్‌ను ధ్వంసం చేయించడంతో పాటు, పశువుల కొట్టాన్ని కూడా కూల్చివేయించారని వాపోయారు. ఈ ఘటనల వల్ల లక్షల రూపాయల మేర ఆర్థిక నష్టం వాటిల్లిందని తెలిపారు. తన కుటుంబం తరతరాలుగా సాగు చేస్తున్న భూమిపై అక్రమంగా హక్కులు సాధించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించిన కనకయ్య, ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీసు శాఖ సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. భూమికి సంబంధించిన పాత రికార్డులు, సాగు ఆధారాలు, పన్ను రసీదులు, ఇతర పత్రాలు తమ వద్ద ఉన్నాయని, అవసరమైతే అధికారుల ఎదుట సమర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అక్రమ పట్టాలు, భూ ఆక్రమణలు, దౌర్జన్యాలపై తక్షణ చర్యలు తీసుకుని తన కుటుంబానికి రక్షణ కల్పించాలని, తన భూమిపై ఉన్న హక్కులను పరిరక్షించి న్యాయం చేయాలని కనకయ్య ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. రైతుల భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కావని ఆయన పేర్కొన్నారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

## కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**తెలుగు గళం న్యూస్, వర్ధన్నపేట, జూన్ /20**

వర్ధన్నపేట నియోజకవర్గం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవానీ కుంట తండాలో విద్యుత్ షాక్‌తో బానోత్ గణేష్ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు హుటాహుటిన వర్ధన్నపేట మార్చురీకి చేరుకున్నారు. మృతుడి భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, గణేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కారాల కోసం ఆర్థిక సహాయం అందించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గణేష్ కుటుంబానికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాలకు పెద్దపీట



**రామోజీ కుమ్మరిగూడెం తండాలో ఇందిరా భవనానికి ఎమ్మెల్యే నాగరాజు భూమిపూజలి**

**బీఆర్ఎస్ మహిళలను నిర్వీర్యం చేస్తే, కాంగ్రెస్ గౌరవం ఇచ్చింది: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**ఇందిరా మహిళా శక్తికి ఊతం: 10 లక్షలతో ఇందిరా భవనం నిర్మాణం ప్రారంభం**

**తెలుగు గళం న్యూస్, వర్ధన్నపేట, జూన్ /20**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గం వర్ధన్నపేట మండలం రామోజీ కుమ్మరిగూడెం తండాలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా విజయలక్ష్మి గ్రామైక్య సంఘానికి రూ. 10 లక్షలతో మంజూరైన ఇందిరా భవనం నిర్మాణానికి వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్ నాగరాజు భూమిపూజ చేశారు. విజయలక్ష్మి గ్రామైక్య సంఘం ఆహ్వానం మేరకు ఆయన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. సర్పంచ్ భూక్యా సుశీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా రాష్ట్రంలో మహిళా సంఘాలను పట్టించుకోకపోగా నిర్వీర్యం చేసిందని ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ మహిళా సంఘాలకు పెద్దపీట వేసిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు కనీసం మంత్రి పదవి కూడా ఇవ్వలేదని కానీ రేవంత్ రెడ్డి సర్కార్ ఆదివాసీ సామాజిక వర్గానికి చెందిన సీతక్కకు, బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖకు మంత్రి పదవులు ఇచ్చి మహిళల గౌరవాన్ని నిలబెట్టిందని అన్నారు. ఒక్కో మహిళా సంఘానికి వడ్డీలేని రుణాలు, మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, రైస్ మిల్లులు, పండ్ల మార్కెట్లు, మహిళల పేరుమీద ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. ఈ దేశంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా మహిళలకు ఇంతటి ప్రాధాన్యం ఇచ్చిన చరిత్ర లేదని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన బతుకమ్మ చీరలను మహిళలు పంట పొలాల్లో పిట్టలు వాలకుండా, బాత్‌రూముల చుట్టూ కట్టుకున్నారని, అంటే వారు ఇచ్చిన చీర విలువ అలాంటిదని ఎద్దేవా చేశారు. కానీ రేవంత్ రెడ్డి సర్కార్ ఇస్తున్న బతుకమ్మ చీరలను మహిళలు భద్రంగా దాచుకుంటున్నారని, చుట్టాల ఇళ్లకు వెళ్లినప్పుడు కట్టుకుంటున్నారని, ఇదే మన ప్రభుత్వం ఇస్తున్న చీరలకు ఉన్న విలువ అని అన్నారు.

అదేవిధంగా ఎమ్మెల్యే స్థానిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి భోజన సదుపాయాలపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించి, తక్షణమే కొత్త భవనం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇబ్బంది పడుతున్నందున తక్షణ సహాయం కింద రేకుల షెడ్డు నిర్మాణం కోసం తన జీతం నుంచి రూ. 10,000లను సర్పంచ్ భూక్యా సుశీలకు అందించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, ఐనవోలు టెంపుల్ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొడగని రాజేష్ కన్నా, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం, జిల్లా సీనియర్ నాయకులు పోషాల వెంకన్న గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు భూక్యా చిన్న శంకర్, సీనియర్ నాయకులు భూక్యా మల్లు నాయక్, భూక్యా పెద్ద శంకర్, రాములు, ఉప్పునూతుల దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరి మండలం లో ప్రీ-ప్రైమరీ ఇన్స్ట్రక్టర్లకు 62 దరఖాస్తులు

## ఆయాల నియామకాలకు 15 దరఖాస్తులు

## మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి, జూన్ 20 :**

మండలంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలలోని ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ల కోసం 62 దరఖాస్తులు రాగా, ఆయాల నియామకాల కోసం 15 దరఖాస్తులు ఈ నెల 19 వరకు అందినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ మండల పరిధిలోని పర్వతగిరిలో ఇన్స్ట్రక్టర్ కోసం 21 దరఖాస్తులు, ఆయా కోసం 3 దరఖాస్తులు, అన్నారం ఇన్స్ట్రక్టర్ కోసం 14 దరఖాస్తులు, ఆయా కోసం 6 దరఖాస్తులు, కొంకపాక ఇన్స్ట్రక్టర్ కోసం 13 దరఖాస్తులు, ఆయా కోసం 2 దరఖాస్తులు, ఏనుగల్లు ఇన్స్ట్రక్టర్ కోసం 14 దరఖాస్తులు, ఆయా ఆయా కోసం 4 దరఖాస్తు అందినట్లు మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి తెలిపారు.


# మృతుని కుటుంబాన్ని పరామర్శించిన పర్వతగిరి పిఏసీఎస్ చైర్మన్ యం. మనోజ్ గౌడ్



**తెలుగు గళం న్యూస్,పర్వతగిరి,జూన్/20**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం అన్నారం గ్రామానికి చెందిన ముంజంపెల్లి రాములు గత రోజులనుండి అనారోగ్యం తో గురై శనివారం రోజు ఉదయం 8 గంటలకు తుది శ్వాస వీడిచారు వారి పార్థివ దేహనికి పూల మాలల తో సంతాపం తెలిపీ కుటుంబ సభ్యులను పర్వతగిరి పిఏసీఎస్ చైర్మన్ యం.మనోజ్ గౌడ్ , పరామర్శించినారు. మాజీ ఎంపీటీసీ కో – ఆప్షన్ సభ్యులు షబ్బీర్ ఆలీ, మాజీ సర్పంచ్ బాబు, మాజీ ఉప సర్పంచ్ రాపోలు యాకయ్య, కుల పెద్దలు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఉరుములు..మెరుపులు.. ఇల్లందలో తాటిచెట్టుపై పిడుగుపాటు:వణికిన గ్రామస్తులు



**తెలుగు గళం న్యూస్, వర్ధన్నపేట, జూన్/20**

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో శనివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ క్రమంలో గ్రామంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. జనావాసాలకు సమీపంలోనే ఈ ఘటన జరగడంతో గ్రామస్తులు, చిన్నారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇలాంటి సంఘటనను తాము ఇంతకుముందు ఎన్నడూ చూడలేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. వర్షం కురుస్తున్న సమయంలో బయటకు రావాలంటేనే భయపడుతున్నామని, పిడుగులు పడే అవకాశం ఉండటంతో ప్రాణ భయంతో వణికిపోతున్నామని గ్రామస్తులు తెలిపారు.

# మరిపెడ లో వంద పడకల ఆసుపత్రిని తనిఖీ చేసిన ప్రభుత్వ విప్



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలోని నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆసుపత్రిని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్, శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అనేక కీలక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మరిపెడలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని ప్రారంభించామని తెలిపారు.

గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై తగిన శ్రద్ధ చూపలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, గ్రామీణ ప్రాంతాలకు కూడా ఆధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదల సొంత ఇంటి కల సహకారం.



**మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం**

**పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం.**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటంతో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం.**

**ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్.**

**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి , జూన్/20**

పర్వతగిరి మండలం గుగులోత్ తండా గ్రామంలో ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు అధేశాల మెరాకు బానోత్ ద్వాలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గుగులోత్ గమ్మి వీరన్న గారితో కలిసి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటంతో గృహప్రవేశం చేసిన భాను ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, సభండ వర్గాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వమని, పేద ప్రజల సొంతింటి కల సహకారం కోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తూ వారి కళలను నెరవేరుస్తున్న, కుల, మత బెదం లేకుండా, పార్టీల భేదం లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమం కోసం నిరంతరాయంగా కృషి చేస్తా ఉన్నదన్నారు. పర్వతగిరి మండలంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నాయకత్వంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఇందిరమ్మ ఇల్లు, ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి, రైతు భరోసా, సన్న బియ్యం, 500 లకు గ్యాస్ , రేషన్ కార్డు, సన్నా వారి ధాన్యం 500బోనస్ వంటి పథకాలకు దళారీ వ్యవస్థ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు అధికారులతో నిరంతరంగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ప్రతి ఒక్కరికి చెందేలా కృషి చేస్తా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ'అధ్యక్షులు గుగులోత్ చందు, గ్రామ కార్యదర్శి అరుణ, ఉప సర్పంచ్, ఎస్టి సెల్ అధ్యక్షులు భానోత్ భాస్కర్ నాయక్ ,బోట్ల వెంకన్న, వార్డ్ సభ్యులు మరియు కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.